

# గీత

### సత్యవాడ ఇందిరాదేవి

"మిస్ గీతా! ఇవాళ నా బర్త్‌డే- దయచేసి మా యింటికి..." అర్థోక్తిలో వదిలేసి నసుగుతున్నాడు సుధాకరరావు.

"సకుటుంబ బంధుమిత్ర సపరివార సమేతంగా విచ్చేసి, మీరిచ్చే విందు గైకొని, మిమ్మానందింపజేయాలి. అంతే గదండీ రావుగారూ! బై దిబై-సమేతంగా అంటే తెలుసా? 'మేతతో కూడుకుని' అని - మేత అంటే తిండిగదా. మీ భోజనం ఏర్పాట్లు మీరు చేసుకున్నాక మా ఇంట్లో శుభకార్యానికి బయల్దేరిరండి' అని అర్థంట ఈ సంగతి ఎవరు చెప్పారనుకున్నారు? మా ఇంగ్లీషు మాష్టారు. అబ్బో - ఇలాంటి జోక్స్ తెగచెప్పి నవ్వించేసేవారు బియ్యేలో" - అంటూ

ఫక్కుమని నవ్వింది గీత, పలువరస తళతళ లాడేట్లు.

విస్తుపోయి చూశాడు రావు.

ఎప్పుడూ అంతే గీత.

ఆఫీసులో వాళ్ళు తమతో రమ్మని పిలిస్తే సంభాషణ పెడదారి పట్టించేసి చివరికి 'సారీ! నేను రాలేను;' అంటుంది

అదే ఆఫీసులో అంతకుముందు ఒక అమ్మాయి పనిచేసింది. మిగతావాళ్లెవరూ పలకరించకపోతే తనే పలకరించేది. ఏదోవంకన వాళ్ళఇళ్ళకు వెళ్లేది. ఇద్దరు ముగ్గురితో సినిమాలు చూసింది.

ఆమె వెళ్ళిపోయాక గీత జాయినైంది అదే పోస్టులో. మిగతావాళ్ళంతా మగ వాళ్ళు - తనొక్కతే ఆ ఆఫీసులో ఆడపిల్ల - అయినా గీత నిర్భయంగా, సింపుల్‌గా, సాఫీగా వుంటుంది. తగినంత నమ్రతావుంది. కాస్తంత పొగరూవుంది. అందరితో హాయిగా మాట్లాడుతుంది. కానీ ఎవ్వరికీ చనువివ్వదు. అందినట్లే వుండి, చటుక్కున అంత ఎత్తుకెగిరి పోతుంది అందుకోబోయే వేళకు.

మిత్రబృందం అందరి ముందరా ప్రతిజ్ఞచేశాడు రావు. "గీతను తీసుకొస్తా నివాళ మా ఇంటికి. నా త డా ఖా చూడండి" అని.

అందుకోసమే అతని ఈతాపత్రయం.

"అదికాదు గీతాదేవీ! మీరు తప్ప కుండా రావాలి. మేతా, నాతా అంటు న్నారే. అది మీరేం తెచ్చుకోనక్కర్లేదు లెండి. నేనదంతా ఏర్పాటుచేస్తున్నాగా." సగర్వంగా అన్నాడు రావు.


పెదిమలు విడీవిడకుండా నవ్వింది గీత. అలా నవ్విందంటే ఆమె ఒళ్ళు మండుతున్న దన్నమాట...అని అమె అప్తులకుమటుకు తెలుసు

"అయ్యో! తప్పకుండా వచ్చేదాన్నే నండీ. నాకెంతో ఇష్టం ఇలా పార్టీస్‌లో పాల్గొని ఎంజాయ్ చెయ్యటం - వెధవది లైఫ్‌అంటే మూన్నాళ్ళముచ్చట -అన్ని సరదాలూ త్వరత్వరగా అనుభవిం చెయ్యక పోతే ముసలాళ్ళ మయ్యాకేం అనుభవిస్తాం నా మొహం?..."

గీతమాటలు పూర్తికాకుండా మధ్య లోనే అందుకుని "కరెక్ట్ - గీతా! కరెక్ట్. బాగా చెప్పారు. ఆ ఉమర్ ఖయ్యామ్ ఫిలాసఫీ లాంటిదే నాదీనూ." అంటూ చప్పట్లు కొట్టినంత హంగామా చేశాడు రావు. మొహమంతా నవ్వు పులుముకుని పిట్ట వలలోపడిందిగదా అని.

విశాలమైన తన కను రెప్ప లెత్తి చిత్రంగా అతనివంక చూసి తీగెల్లాంటి కనుబొమలు ఒక్కక్షణం ముడి చి- కంటిన్యూ చేసింది గీత-

"కానీ ఒక్క సరదా తీరే అవకాశం కూడాలేదుగదండీ నాకు. చచ్చేచావొచ్చి పడింది శశికళా బాపిరాజులతో - ఆఫీసు విడిచిపెట్టంగానే ఇంటికిపోతే గోలగోల- నౌకర్లు ఎంతమంది వున్నా పనికిరారు దొరలకి - నేనే వెళ్ళాలి-పాలు పట్టాలి-




బిస్కెట్లు పెట్టాలి. ఆ బాపిగాడు గంభీరంగా వుంటాడుగానీ కాస్త - ఈ శశే నండీ మరీ అల్లరీ ఆగంచేసి నాప్రాణాలు తోడేస్తుంది. నా ఈడు అమ్మాయిలంతా హాయిగా తిరుగుతూ లైఫ్‌ని ఎంజాయ్ చేస్తుంటే, నాకిదో జంజాటం పట్టింది ఖర్మం-" నుదుటలేని చెమటను, ఉస్సురంటూ బుల్లిరుమాలుతో వత్తుకుంది.

గుండె తారె త్తిపోయింది రావుకి.

మళ్ళీ అంతలోనే మినుక్కుమంటూ చిన్న ఆశ:

"మీ తమ్ముడూ చెల్లెలూ బాగా అల్లరి చేస్తారన్నమాట - మీ దగ్గిరే చేరిక ఎక్కువ గాబోలు" నేర్పుగా ప్రశ్నించా ననుకున్నా డతను-

"ప్చ - నాకు అంత భాగ్యంఎక్కడి దండీ. మా అమ్మానాన్నలకు నేనొక్క దాన్నే సంతానం. శశీ బాపీ వచ్చాక ఆ మాటే మర్చిపోయానుగానీ, అంతకు ముందైతే తెగ బాధపడేదాన్ని తమ్ముళ్లూ చెల్లెళ్లూ లేరని. కాస్త అల్లరి అన్నమాటే గాని శశీ బాపీలతో ఇట్టే పొద్దుపోతుంది. అరె. మాటల్లోపడి నుంచుండిపోయాను, మావాళ్ళ నిరీక్షణ ప్రారంభమయ్యే వుంటుంది - పీకేస్తారు ఆలస్యమైతే. సారీ మిస్టర్ సుధాకర్‌రావ్। నేను రాలేను. చెప్పానుగా అందాలు చిందే నా చిన్న ఇల్లే నా స్వర్గధామం అని. నా శశీ. బాపీ, రామూ, వీళ్ళే నా సర్వస్వం." మరో కొత్తపాత్రను కూడా ఇంట్రడ్యూస్‌చేసి, మెల్లిగా, ముద్దుగా మందహాసం చేసి హైహీల్డ్‌షూస్ టక టక లాడించుకుంటూ వెళ్ళిపోయింది గీత. అయిదడుగుల అయిదంగుళాల పొడుగూ,

తగినంత లావూ వుండి - చూడచక్కని పెర్సనాలిటీగల గీత.

నిర్ఘాంతపడి నుంచుండిపోయాడు సుధాకరరావు.

"ఏమైంది రావ్ ? గీత అలా వెళ్ళిపోతోంది. నువ్విలా... కొంపదీసి నీ చెంపగాని పరామర్శించ లేదుగదా-" అంటూ పరిగెత్తుకొచ్చారు, దూరంగా వుండి పర్యవేక్షిస్తున్న నారాయణా, రాజూ, మాణిక్యం, మూర్తి.

"ఒరేయ్; ఒరేయ్ ! గీత ఇద్దరు పిల్లల తల్లి కూడాట. మాళవీ మాబాపీ అంటూ ఆ పిల్లలస్మరణే - వాళ్ళాయన పేరో ఏమిటో రామూ అనికూడా అన్నది" ఉసూరుమని వాపోయినాడు రావు. "ఆఁ" అని నోళ్ళుతెరిచారు మాణిక్యం - నారాయణా-రాజూ - వాళ్ళ నోళ్ళల్లోకి ఈగలవ్వీ పోకుండా విసిరి జాగ్రత్తపడ్డాడు మూర్తి.

ఎట్టకేలకు తేరుకుని "మట్టెలూ, నల్లపూసలూ లాంటివేం పెట్టుకోలేదేం మరి ? మంగళసూత్రమైనా వుండాలేదా అసలు ? దింపుడుకళ్ళం ఆశగా, జనాంతికంగా పృచ్ఛ చేశాడు మాణిక్యం.

"అదేరా - ఈనాటి ఆడపిల్లల చాకచక్యం. పిల్లలతల్లులూకూడా కన్నెపిల్లల్లా కన్పించాలని తహతహ లాడతారు. గీత మెళ్ళో ఏదో గొలుసుందిగదూ ఈ రోజుల్లో ఆడపిల్లలంతా పమిటమీదికి వేసుకొంటుంటే ఈవిడ జాకెట్ లోపల వేసుకుందేమిటీ గొలుసు ? అనుకునేవాణ్ణి. మీతో అనలేదుగాని నాకప్పుడే అనుమానం వచ్చింది. ఈపిల్ల పెళ్ళైన దానిలా వుందిస్మీ అని. తాళిబొట్టు గొలుసులో వుందన్నమాట. ఆహా! ఎంత మోసపోయాం. ఇన్నాళ్ళనించీ ఎంత అఱ్ఱులు చాచాం" అని దీర్ఘ దీర్ఘంగా నిట్టూర్చాడు నారాయణ.

"ఏమో-నాకాట్టే నమ్మకంగా లేదు, ఆపిల్ల ఇద్దరుబిడ్డల తల్లిఅంటే. మొహంలో పసితనపు ఛాయలు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నై, యౌవనగర్వం తాలూకు మిసమిసలున్నై- తన అనురాగాన్ని మరో వ్యక్తికి ధారపోసిన ఛాయలులేవు-మాతృమూర్తి లక్షణాలు అసలులేవు. ఇందులో ఏదో మిస్టరీ వుండబ్బాయి !" తాపీగా, సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు మూర్తి.

ఆశగా, ఆత్రంగా చూశారు మిత్రబృందం-వాళ్ళకు మూర్తి మాటలమీద, తెలివితేటలమీద-మంచి నమ్మకం

"ఈ విషయం త్వరగా తేల్చేసుకోవాలి" అని నిర్ణయించారు. అందుకు మూర్తే తగినవాడనికూడా తేల్చారు.

"తప్పదా ?" స్టయిల్‌గా అడిగాడు మూర్తి బెట్టుసరి ఒలకబోస్తూ.

"తప్పదు." ముక్తకంఠంతో అరిచారు మిగతా నలుగురూ.

"సరే. మీరంతగా బ్రతిమాలుతున్నప్పుడు కాదనడం బావుండదు. మీకోసం ఆమె విషయం కనుక్కోవడానికి ప్రయ



యువ

త్నిస్తాను." భక్తులకు అభయమిస్తున్న శ్రీమహావిష్ణువు పోజులో, అన్నాడు మూర్తి

"ధన్యోస్మి" అనటానికి బదులుగా ''విష్ యు ది బెస్ట్ ఆఫ్‌లక్" అన్నారు వాళ్ళు ఉత్సాహంగా-

తర్వాత నాలుగురోజులు గడిచాయి.

ఈలోపల గీతతో కాస్తసాన్నిహిత్యం పెంపొందించుకున్నాడు మూర్తి మంచి పెర్సనాలిటీ, చక్కని మానర్స్, నిర్దుష్టమైనవర్క్, ఖచ్చితమైన పంక్చు యాలిటీగల మూర్తితో ఏ ఆడపిల్లైనా హాయిగా మాట్లాడుతుంది - సందేహించదు.

మరీ స్ట్రిక్టుగావుండే గీతకూడా చిరునవ్వుతో మొదలుపెట్టి - మాట్లాడ్డందాకా వచ్చింది-

వెకిలి మనుషులను ఎంత అసహ్యించుకుంటుందో మర్యావస్థులను అంత అభిమానిస్తుంది గీత అని చూచాయగా తెలిసింది మూర్తికి.

ఒకనాటి సాయంకాలం...

బజార్లో ఏవో కొంటూ కనిపించింది గీత.

గబగబా ఆమెను సమీపించి విష్ చేశాడు మూర్తి.

అలిసిపోయివున్న గీత హాయిగా నవ్వింది.

''ఒక్కరూ షాపింగ్‌కి వచ్చారేం? మీ...?'' అతని మాటమధ్యలోనే చటుక్కున అందుకుందామె.

''మాళశీవాళ్ళ సంగతా? వాళ్ళనెప్పుడూ బజారుకి తీసుకురాను బాబూ- ఒకటే ఆగంచేస్తారు? తిన్నగా కొననివ్వరుగదా ఏదీను. అరుపులూ గోలాను. అబ్బబ్బ - ప్రాణాలు తీసేస్తున్నారనుకోండి వీళ్ళు. అన్నట్లు బిస్కెట్లు కొనటం మర్చిపోయాను. కొనకపోతే వాకిట్లోనే ఎదురుపడి చంపేశారన్నమాటే" అంటూ కొట్లోకి దూరిపోయింది.

చిన్నగా నవ్వుకున్నాడు మూర్తి. అప్పుడతని ఉంగరాలజుట్టు మరింత అందగించింది. గీత పరమకుతూహలమేదో దాచుకుంటూ తనవంక చూస్తోంది అనుకున్నాక అతనిమనస్సు జల్లుమన్నట్లైంది. ఆ చూపులకు భాష్యం చెప్పుకుని ఆ కళ్ళలోని భావాలు చదువుకొని, ఆమె కుతూహలాన్ని అర్థం చేసుకున్నాక-అతని మనస్సు దూదిపింజెలా తేలిపోయి అలా అలా స్వర్గద్వారందాకా విహరించి చక్కావచ్చింది.

కానీ స్వర్గంలోకి ప్రవేశించట మెలాగ?

మర్నాడు లంచ్‌టైమ్‌లో -

గీతను కలుసుకున్నాడు మూర్తి.

''ఇవాళ మా పూర్ణచంద్రిక పుట్టిన రోజండీ, మీరు తప్పకుండా రావాలి. మావాళ్ళంతా ఎంతో ఆత్రంగా ఎదురు

చూస్తూంటారు మీరాకకోసం - ఎప్పుడూ చెప్తుంటాగా మీగురించి" అంటూ ఓరగా ఆమెవేపు చూశాడు.

తడబాటుపడి ఏదో అనబోయింది గీత -

కానీ ఆమెకా అవకాశమివ్వకుండా కల్పించుకున్నాడు మూర్తి.

"మావాళ్ళకి వాగ్దానం చేశాను మిమ్మల్ని వాళ తీసుకొస్తానని. ఆవిడా పిల్లలగన్న తల్లే, మన చంద్రిక పుట్టిన రోజుకి ఎందుకురారు ? తప్పకవస్తారు - అని ధైర్యం చెప్పా పైగా."

గీత మొహం ఒక్కక్షణం నల్లగా అయింది.

నెమ్మదిగా అన్నది ''సారీ - నేను రాలేను. నాకు ఇంటిదగ్గిర..." ఎందుకనో గాని ఎప్పటిలా ఆమె కంఠం వెంటనే పెగిలిరాలేదు-

"మీ శశికళా, బాపిరాజూ, రామూ గార్లు వెయిట్ చేస్తుంటారంటారు-అంతేగా మీ జవాబు ? ఉహుఁ నేనొప్పుకోను ఇవాళ. ఆప్తుల వియోగం క్షణకాలమైనా ఎంతబాధాకరమో నాకూ తెలుసులెండి. తప్పదుమరి. ఒక్క అయిదునిమిషాల్లో పంపించెయ్యనూ మిమ్మల్ని ? రేపు మీ పిల్లల పుట్టినరోజుకి మేము రావద్దా ఏం ?" ఓరగా, చురుగ్గా చూస్తూ-అందు కున్నాడు మూర్తి.

గీత నీరసంగా అయిపోయి కుర్చీలో కూలబడింది. మొహమంతా చెమట పట్టి నట్లైంది కానీ తుడుచుకోనేలేదు ఈసారి. ఏమాత్రం శక్తిలేని దానిలా, అచేత నంగా, నిస్తేజంగా అలాగే వుండి పోయింది ఒక్కనిమిషం.

వెంటనే సర్దుకుని "ఆల్‌రైట్. వస్తాను." అన్నది.

సాయంత్రం ఆఫీసు వదిలాక -


వద్దువద్దని గీత ఎంత వారిస్తున్నా వినకుండా టాక్సీ మాట్లాడాడు మూర్తి- ఇద్దరూ దూరంగా కూచున్నారు వెనక సీట్లో.

గీత కళ్ళుమూసుకున్నది, ఏదో ఆవే దనను అణిచిపెట్టుకునే ప్రయత్నంలో-

"మిస్ గీతా !" చెవిలో పిలిచినట్లై కళ్ళు తెరిచి చటుక్కున పక్కకు తిరి గింది. అంతవేగంగానూ అతనూ దూరంగా జరిగాడు. ఆమె పెదవులు వణికాయి. మొహంలో కోపమూ, నిస్స హాయతా, బాధా కన్పిస్తున్నాయి.

"నేను ఇంటికివెళ్ళిపోతాను" అందా మనుకుంది. కానీ తను బయటపడటం దేనికి ? "పదినిమిషాలు ఓపికపడితేసరి" అనుకుంది.

"ఇరుగోనమ్మా ! గీతాదేవిగారు ! తీసుకొచ్చాను. సరోజా, విజయా, తొందరగావచ్చి ఎవరొచ్చారో చూడండి. ఎక్కడికీ ఎప్పుడూ రాని ఆవిడ ఇవాళ మనింటికి వచ్చారు. ఎలాచూసుకుంటారో ఏమిటో. మొత్తానికి మన పూర్ణచంద్రిక ఘటికురాలే. గీతగార్ని రప్పించింది-"




అంటూ తెగహడావుడి చేశాకు మూర్తి. ఇంట్లో అడుగు పెడుతూనే-

ఇల్లు మరీ అంత పెద్దది కాకపోయినా కుదిమట్టంగా, నీట్‌గా, ముచ్చటగావుంది. పూర్వకాలం పద్ధతిలో గుమ్మాలకు పసుపూ కుంకుమా, మామిడాకుల తోరణాలూ, హాల్లో ముగ్గులూ, ఉయ్యాల బల్లా...వున్నై. మొత్తానికి ఇంట్లో శుభ కార్యం సూచనలు స్వల్పంగా కన్పిస్తున్నై.

లోపలినించీ యాభయ్యేళ్ళ ముత్తయిదువ ఒకావిడ వచ్చింది. ఆమెవెనకాలే పెళ్ళైన అమ్మాయి ఒకతె, ఓణీలు వేసుకునే అమ్మాయిఒకతె వచ్చారు - మూర్తి పిలుపుకి.

గీతను చూడగానే విప్పారిన మొహంతో లోపలికి తీసుకెళ్ళి మర్యాద చేశారు. గీత ఆపెళ్ళైన పిల్లవంక పరికించి చూసింది. మూర్తిపోలికలు స్పష్టంగా కనిపించడంతో ఆపిల్ల అతని చెల్లెలే అని నిశ్చయించుకుని, మరెవరి కోసమో చూడటం మొదలు పెట్టింది.

''ఏమిటలా పరధ్యానంగా వున్నారు?'' అంటూ ఆమె కాఫీ తాగుతూంటే తనూ వచ్చి మరొకపీట వాల్చుకున్నాడు మూర్తి.

"అహ - ఏంలేదు'' నెమ్మదిగా అన్నది గీత-

"ఎందుకులేదు ? వుంది - నాకు తెలుసులెండి-ఇందాకట్నించీ మీరు చాలా డల్‌గా వున్నారు. ఇంటిదగ్గిర మీ పిల్లలూ శ్రీవారూ గుర్తుకొచ్చి వుంటారు. మరీ అంత క్లోజ్ ఎటాచ్‌మెంట్ కష్టమే మరి-ఈ ఉద్యోగం ఒకటాయె పైగా - ఎలా నెగ్గుకొస్తున్నారో ఏమో...సానుభూతిగా నవ్వాడు మూర్తి.

పెదవులు విడకుండా నవ్వింది గీత కూడా-

"అన్నట్టు పూర్ణచంద్రికా, వాళ్ళ అమ్మగారూ ఏరి? పరదాసిస్టమ్ ఏమన్నా అమలు జరపటల్లేదుగా మీ మిసెస్‌కి?" తమాషాకి అడిగినట్టే అడిగింది.

"మిసెస్సా? ఎవరికి?" అని తెల్లబోయినట్లై "ఓహ్-సారీ, మీకింకా మా చంద్రికను చూపించలేదు గదూ-క్షమించాలి. రండి-చూపిస్తాను" అంటూ పెరట్లోకి నడిచాడతను వస్తున్న నవ్వుని ఉగ్గబట్టుకోలేక సతమతమైపోతూ.

'ఎక్కడికి రమ్మంటాడితను? పెరటి వేపు నడుస్తున్నాడు మరి-ఏ అరటి చెట్టునో చూపించి పూర్ణ చంద్రిక అనడుగదా-' అనుకుంది క్షణం-వెంటనే తన వూహకు నవ్వుకుని మూర్తి చెల్లెళ్ళ కోసం చూసింది. ఒక అమ్మాయి అక్కడలేదు. ఒకమ్మాయి ఏదో పనిలో వుంది.

తనొక్కతే కుతూహలంగాఅతన్ననుసరించవలసి వచ్చింది. అదే క్షణంలో ఆమె మనసులో మరో ఊహ మెదిలింది. దొడ్లో పాకదగ్గిరకే వెళ్తున్నాడేమిటి ఇతను? మంగమ్మ శపథంలో లాగా భార్యను బందిఖానాలో పెట్టలేదు గదాఅని - ఈ ఊహదాచుకోకుండా పైకి అనేసింది. మూర్తి నవ్వాడందుకు సమాధానంగా - కమ్మగా నవ్వాడు.

ఇంతకూ అది గొడ్లపాక - అందులో ఒక ఆవూ, దూడా కుందనపు బొమ్మల్లా వున్నై. లక్ష్మీకళతో అలరారుతున్నై. నుదుట పసుపురాసి కుంకుమ పెట్టారు. మెడలో పూలదండా గజ్జెలూ వేశారు. తెల్లనిరంగుతో మిసమిస లాడుతున్నై. దూడ నుదుటిమీద మాత్రం నల్లరంగు మచ్చవుంది.

"ఇదుగోనండీ గీతాదేవి గారూ! మా పూర్ణమ్మ - ఎంత ముద్దుగావుందో చూశారా?" అంటూ దూడ మూపుమీద చెయ్యివేశాడు మూర్తి-

ఆరక్షణంపాటు మ్రాన్పడిపోయింది గీత.

"ఇదుగో - చంద్రికావాళ్ళమ్మ-లక్ష్మి-చంద్రిక పుట్టాక మా ఇంటికెంతో కలిసివచ్చింది లెండి. కోర్టులో మేము కేసు గెలిచాం. అంతవరకూ ఓడిపోతామనుకున్నాం గాని దాయాదులు ఆక్రమించుకున్న మా ఆస్థి చేతికివచ్చింది.

మా పెద్ద చెల్లెలికి మంచి సంబంధం కుదిరింది. కానీ కట్నం అఖ్ఖరలేకుండా దాన్ని పెళ్ళిచేసుకున్నాడు మా బావగారు. మా అమ్మకి కాస్త ఇలాంటి నమ్మకాలు ఎక్కువలెండి. మేముకూడా - ఆవిడ నమ్మకాలన్నీ శుభప్రదమైనవే కావటం చేత - అంతగా అబ్జెక్టు చెయ్యం. మా నాన్నగారు భాగవతం దశమస్కంధం చదువుతుండగా ఈ దూడ పుట్టింది. అందుకనే ఆ పేరు పెట్టారు. పూర్ణచంద్రికా, భారతీదేవిలాంటి ముచ్చటైన

పేర్లతో ఆవులను పిలిచేవాగటకదా గోపాలకృష్ణుడు" అన్నాడు మూర్తి ఆమె వేపు ఓరగాచూస్తూ. ఆమె మొహంలో మారేరంగులు గమనిస్తూ - కొంటెతనం ఒలకబోస్తూ-

ఆమె వదనంలోని అవర్ణనీయమైన భావాలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అల్లరీ, గర్వమూ, నిర్లక్ష్యమూ- తాండవించే ఆ యువతి మొహంలో ఒక రకమైన మౌగ్ధ్యమూ, లజ్జా, చిరుకోపమూ విస్మయమూ - తారట్లాడుతున్నాయి. తనను తాను మర్చిపోయి; తన అహాన్ని మర్చిపోయి, కేవలం ముద్దరాలిగా నిలబడిన ఆ స్త్రీమూర్తిని చూసి-పురుషత్వం పరవశించి చేతులు చాచింది.

వెంటనే జాగృతుడై - ఆవేశాన్ని నిగ్రహించుకుని - "ఏమిటలా చూస్తుండిపోయినారు ? ఈ పోజులో మీరు చాలా లవ్లీగా కన్పిస్తున్నారు గీతా ? ఎక్స్క్యూజ్ చెయ్యాలి నన్ను. మనసులో దాచుకోకుండా చెప్పేసినందుకు - మీరు సహృదయం గలవారు - నామీద కోపం తెచ్చుకోరని నమ్మకం వుంది. నేనేం మాట్లాడినా, ఎలా ప్రవర్తించినా - నా నమ్మకాన్ని మటుకు వమ్ము చేయకండేం ? మీరు నవ్వనంటే చంద్రికను గురించి మరో విశేషంకూడా చెప్తాను. వింటారా మరి ?" అని అడిగాడతను

"చెప్పండి" అన్నదామె పౌడిగా. అతని పొగడను, కించిల్లజ్జావనతమైన మొహాన్ని ఎత్తటానికి ప్రయత్నిస్తూ. తనెందుకిలా - బొత్తిగా ఆకదానిలా మారిపోతోందో - తన స్వాభిమానం ఎందుకిలా జావగారిపోతోందో ఆమెకు బోధపకటల్లేదు.

"గొడ్డొచ్చిన వేళా-కోడలొచ్చినవేళా అని అంటారుట. ఈ సామెత మా అమ్మ చెప్తుంటుంది. మంచిఅల్లుడు వచ్చినట్లుగానే మంచికోడలు కూడా వస్తుందిట తనకి- ఏమిటో ఆవిడ చాదస్తం-సరే పదండి. మిమ్మల్ని ఇంటిదగ్గిర దిగబెట్టి వస్తాను. ఆలస్యమైనట్లుంది. క్షమించాలి - మీ పిల్లలూ - మీవారూ... నామీద కారాలు మిరియాలు నూరుతున్నారేమో" అని ఖంగారుపడ్డాడు మూర్తి.

గీత మెత్తగా నవ్వింది - మూర్తి గుండె జల్లుమన్నది. కన్నార్పకుండా అలాగే చూడాలన్పించింది.

ఇప్పుడు ఓరగాచూసి, కొంటెతనం ఒలకబోసి మాట్లాడటం గీత వంతైంది.

ఆవుదూడదగ్గిరికి వెళ్ళి ముద్దుగా మెద దువ్వుతూ మొదలుపెట్టింది. "ఈ మగవాళ్ళు ఉత్తమోసగాళ్ళు కదే చంద్రికా. ఎంత మోసం చెయ్యగలరు ఔరా ! అబద్ధాలాడితే అరడజనుమంది ఆడపిల్లలు పుట్టరూ వరుసగా - ఇంతకూ మూర్తిగారి అమ్మగారి కోడలు ఎలా వుండాలిట ? నీకుగాని తెలుసేమో అని అడుగుతున్నా" అన్నది.

"చూడు చంద్రికా ! ఈ విడెలా

యువ

అంటున్నారేనూ - మగజాతిమీదే దండెత్తారు మరీ బొత్తిగా - అసలు నేను అబద్ధాలాడేవాడినా ? ఛ - ఛ - ఒక్క అబద్ధంకూడా ఆడలేదమ్మా. నన్నునమ్ము. ఆవిడ అలా అర్థంచేసుకొంటే నేనేం చేసేది. చెప్పు ? నాకంటే గొప్ప గొప్ప అబద్ధాలాడేవాళ్ళు ఎందరు లేరు , అసలు అబద్ధం ఆడటం ఆడవారి సొత్తుఅంటారు. వాళ్ళు అబద్ధమాడితే గోడపెట్టినట్లు పకడ్బందీగా వుంటుందిట" గీత దగ్గిరిగా వచ్చి అన్నాడు మూర్తి అమాయకంగా-

"అన్నయ్యా ! టాక్సీ వచ్చింది.'' అంటూ అతని చిన్నచెల్లెలు విజయ పరిగెత్తుకుంటూ వచ్చింది.

ఇద్దరూ ఇంట్లోకి వచ్చారు.

మూర్తితల్లి విశాలాక్షమ్మగారు గీత మొహాన బొట్టుపెట్టి, అరటిపళ్ళిచ్చింది దొడ్లోపండినవి. దొడ్లోపూసిన సన్నజాజుల మాలకట్టి ఇచ్చింది సరోజ.

"ఒహ్ _ మీదొడ్లో వున్నాయా ఇవి ? నాకు చాలాఇష్టం" అంటూ ఉత్సాహంగా పుచ్చుకుంది గీత-

సరోజా విజయా తెల్లబోయినట్లయినారు-

"అదేమిటి ? మీరు పెరట్లోకెళ్లారుగా, సన్నజాజిపందిరి వుంది - చూడలేదా ?" అని ఆశ్చర్యంగా అడిగారు-

"అదికాదులే సంగతి - మన పూర్ణచంద్రికను చూస్తూ మైమరిచిపోయారు గీతగారు - అసలే పొద్దుపోయిందాయె. ఇంక సన్నజాజిపందిరీ, గులాబిరంగు మందారచెట్టూ ఎక్కడ చూశారావిడ ? ఇంకోసారి ఎప్పుడన్నావస్తే తీరికగా ఇల్లూ పెరడూ అంతా చూపించవచ్చు" అన్నాడు మూర్తి.

ఆమె మైమరచిపోయినమాట నిజమే గాని చంద్రికను చూశా ? కాదు. ఎంత మాత్రం కాదు.

"తప్పకుండారావాలి గీతాదేవిగారూ ? మా సన్నజాజిపందిరి ఎవరికోసం వెయిట్ చేస్తున్నదనుకున్నారూ ? మా వదినగారి కోసం - మా అన్నయ్యా వదినా ఆ పందిరిదగ్గిర ఛలోక్తులు ఆడుకుంటే చూడాలని మా తహ తహ - ఇంతకీ ఆవిడగారెప్పుడొస్తారో ? మామీద ఎప్పటికి దయకలుగుతుందో - ప్చ్" అంటూ నిట్టూర్చింది సరోజ నవ్వుదాచుకుంటూ-

"అల్లరిపిల్లా !" అంటూ చెల్లెలి చెవి పట్టుకున్నాడు మూర్తి. "అదికాదులెండి గీతగారూ ! మా బావగారూ మా చెల్లాయీ ఆ జాజిపందిరిదగ్గిర కబుర్లు చెప్పుకుంటుంటే చూడాలని మా తహ తహ-ఏదీ- పెళ్ళికాంగానే ఆయనగారేమో ఫారిన్ వేంచేస్తిరి-ఇంకోరెండునెలలకుగాని తిరిగి రారు - ఇక్కడ మా చెల్లాయి పాపం..." సానుభూతి ప్రదర్శిస్తూ నవ్వాడు.

"ఛీ-పో-అన్నయ్యా" అంటూ ఏదో వంకతో పక్కకు తప్పుకుంది సరోజ- ఆమెమొహం సిగ్గుతో ఎఱ్ఱబడటంతోపాటు దీర్ఘవిరహంతో వెలవెలబోయిన సంగతి

గీతకు అర్థమై చిన్నగా నవ్వింది. అలా సరోజను చూస్తుంటే ఆమె యెదకు చక్కిలిగిలి పెట్టినట్లయింది - కనురెప్ప లెత్తి ఇదివరకులా ధైర్యంగా మూర్తిని చూడలేకపోయింది,

ఆప్యాయంగా, సస్నేహంగా గీత చెయ్యిపట్టుకుంది విజయ. అంత ప్రేమ తోనూ, వాత్సల్యంతోనూ ఆ పిల్లభుజం మీద తట్టింది గీత - "ఏమండీ - ఈసారి మళ్ళీరండి. మీతో మాట్లాడ్డం నాకెంతో ఇష్టంగా వుంది. వస్తారుగదూ - అప్పుడు నా పాట విన్పిస్తాకూడా మీకు" - చంటి పిల్లలకి తాయిలం ఆశపెట్టినట్లు -అన్నది విజయ-

ఆ పిల్ల బుగ్గగిల్లి "ఉహూఁ నువ్వు బాగా పాడతావన్నమాట - తప్పకుండా వస్తాను - వెళ్ళొస్తానండీ" అని విశాలాక్షమ్మగారితో చెప్పి టాక్సీ ఎక్కింది గీత.

ఆప్యాయంగా నవ్వుతూ, దగ్గిరికివచ్చి "అప్పుడప్పుడు వస్తుండమ్మా గీతా! నీలాంటి పిల్లలంటే మాకూ, మా పిల్లలకీ ఎంతో ఇష్టం" అన్నది ఆవిడ.

గీత రెండుచేతులూ జోడించి నమస్కారం చేసింది, ఆ ఇల్లూ ఆ వాతావరణం, ఆ వ్యక్తులప్రేమా - ఆమె మనసులో తియ్యని అలజడి లేపింది.

ఇల్లు దగ్గిరౌతున్నకొద్దీ ఊరికే సిగ్గుపడిపోవటం మొదలుపెట్టింది గీత. ఇంత వరకూ ఇంటికెవర్నీ తీసుకువెళ్ళలేదు సరిగదా, ఇల్లెక్కడోకూడా తెలీకుండా జాగ్రత్తపడిందామె. అలాంటిదివాళ ఈ పరిస్థితుల్లో చిక్కుపడిపోయింది. ఉన్నవాడు ఉన్నట్లుండక ప్రేమవిషయంలో శిలాసదృశమైన ఆ పిల్లగుండె కరిగించి వేశాడు పురుషుడన్నవాడు జొరబడి.

"కాలంగాని కాలంలో కోయిల కూత లెందుకనో" అని ఓ పాట విన్నట్లు న్నాను పూర్వం. అట్లాగే - మీరు ఇప్పుడెందుకిలా సిగ్గుపడుతున్నారు? ఓహో- ఇంటిదగ్గిర మీవారు గుర్తుకొచ్చారా? ప్చ్- పక్కాబ్రహ్మచారిని. నాకేం తెలుస్తుంది లెండి ఆ మధురభావన? ఆఫీసునుంచీ ఇంటికి వచ్చేసరికి మీలాగా చిరుసిగ్గుతో ఎదురుచూసే భార్యలున్న భర్తలెంత అదృష్టవంతులో అన్పిస్తున్నది" మర్యాద ఉట్టిపడేగొంతుతో అన్నాడు మూర్తి.

ఇంతలో ఇల్లు రానేవచ్చింది.

ఇంట్లో అడుగుపెడుతుండగానే తెల్లని బొచ్చు కుక్కపిల్లలు రెండు పరిగెత్తుకుంటూ వచ్చినై. ఒకటి ఆమె కాళ్ళను నాకుతుంటే రెండోది ఆమెమీదికి ఎగురుతున్నది బిస్కెట్లకోసం-

"అబ్బ. ఉండుశశీ; అరే-బాపిగా- ఏమిటా ఎగరటం? కొత్తవాళ్ళొచ్చింది చూడకుండా ఇలా అల్లరిపెడితే తంతాను. మీ పిచ్చిప్రేమను చూసి నవ్వుతారాయన" - అంటూ మూర్తిని కూచోమని తనూకూచున్నది. ఇంతలో ఎక్కడినించీ వచ్చిందో చిన్న నల్లపిల్లిపిల్ల ఒకటి మావ్ మావ్‌మంటూ వచ్చి ఆమె ఒళ్లోకి దూకింది. దాన్ని భద్రంగా ఎత్తుకుని

"ఇంతకోపం దేనికిరా రాముా ఒక్క పూట ఆలస్యమైతే - ఇదుగో ఈయనే వాళ్ళింటికి తీసుకువెళ్లారు బలవంతపెట్టి- ఎన్నాళ్ళని తప్పించుకునేదిరా నేను మటుకు? అన్నట్లు వాళ్ళింట్లోనే బుల్లి బుజ్జాయి వుంది. పూర్ణచంద్రిక అని ఎంత ముద్దొస్తోందో దొంగముండ" - అంటూ ఏమిటేమిటో మాట్లాడుతూ వాటిని ముద్దులాడుతున్నది గీత తన్మయావస్థలో.

"ఎదురుగుండా మనుష్యుల్ని పెట్టుకుని" అన్నాడు మూర్తి కల్పించుకుని- వాక్యం పూర్తిచెయ్యలేదు-

ప్రశ్నార్థకంగా చూసింది గీత-

పూర్తి చేశాడతను-

"... వాటినలా ముద్దులాడటమేం బాగాలేదు."

"అంటే..." చురుగ్గా - తీక్షణంగా అడిగిందామె.

"కోప్పడకండి మరి-వాటి అదృష్టం చూసి ఈర్ష్యగా వుందంతే. ఉన్నమాటంటే ఉలుకెక్కువ దేనికండీ మీ ఆడవాళ్ళకి?" అన్నాడతను.

పెదవి బిగబట్టి కనురెప్పలు టపటపా ఆడించి - కోపంగా చూసిందామె.

"నేను ఫ్రాంక్‌గా అడుగుతున్నందుకు మన్నించండి. మాఇంటి కోడలుగా రావటానికి అనుమతిస్తారా? లేదా? ఈ వార్త వినటానికి ఇంటిదగ్గిర మా వాళ్ళంతా ఎదురుచూస్తుంటారు. చెప్పెయ్యాలి మరి. అలా సిగ్గుపడితే లాభం లేదు - ఒప్పుకున్నట్లేనా? ఏదీ! ఇలా చూడాలిమరి. ఆల్‌రైట్ - థాంక్యూ డియర్" - ఉత్సాహంగా అన్నాడతను.

"ఊఁ అంతా మీ ఇష్టమేనా? పెద్ద ఒప్పేసుకున్నట్లు మాట్లాడుతున్నారు- నేను కాదంటే — నా కిష్టంలేదంటే...?" అన్నది గీత—

"మీకా? ఇష్టంలేదా? భలేవారే! మీ మనసే నా వశమైనపుడు ఆమాత్రం గ్రహించలేననుకున్నారా?" అంటూ నవ్వాడతను.

"ఆఫీసులో ఒక్కదానివే ఆడపిల్లవు గనక అస్మజ్జాతి పురుషులవల్ల కీడు రాకుండా కదూ? శశీ బాపీల పేరుచెప్పి హడలగొట్టింది? నాకు పెళ్ళయిందనీ, చంద్రిక నా కూతురనీ మధ్యాహ్నం నువ్వు దిగులుపడ్డావు లేవోయ్ - నేనెలా పెళ్ళిచేసుకున్నా ననుకున్నావ్? నీ కటాక్ష వీక్షణాలకోసమే తపస్సు చేస్తూంటేనూ. సరేగాని అంకరుమగవాళ్లూ చెడ్డవాళ్ళు కారమ్మాయ్. అయినా మీ హద్దుల్లో మీరుండి - తగినంత జాగ్రత్తపడతామంటే మా అభ్యంతరమేం లేదు. మేము మీ జోలికి రాము. ఔనా? నువ్వూ, నీ గుణాలూ నాకు నచ్చాయ్ - ఈ బుగ్గ ఎఱ్ఱబడి మహ ముద్దొస్తోంది. చిన్నసైజు రౌడీననుకుంటావేమోనని ముందేచెప్పి- మరీ చిటికేస్తున్నానోచ్. ఇంక అంతా నీ ఇష్టమే - నేనేం చేసినా ఇకనించీ "విత్ యువర్ కైండ్ పెర్మిషన్ ఓన్లీ మాడమ్!" అంటూ బై-బై - చెప్పాడు మూర్తి.